# ★ క్షణంలో సగం ★

"శారద"

అంతా ఒకటే పచ్చగా అవుపిస్తోంది. పచ్చకామెర్లు కాబోలనుకున్నాను. కళ్ళజోడు తగిలించుకుని ఆలోచిస్తో కళ్లు మూసుకుని చూశాను. ధగధగా మెరుస్తోంది అంతటా. ఓహో! హో!! ఎంత పచ్చదనం! ఏమి వనం!!

ఆకాశాన్నంటే ఆముదపు వృక్షాలు, శోక మెరుగని అశోకవృక్షాలు, చేదెరుగని కాకర తీగెలు, తీయని వేపచెట్లు.

చెట్లనిండా మనుషులు. చెట్లకింద నీడలు. నీడల్లో కలిసి నేనూ వెళ్లాను. ఈ మహాప్రస్థానం ఆఖరైంది. ఎదురుగా మైకు గొంతుక్కి తగిలించుకుని వేదాంతరావుగారు వొస్తున్నారు.

వారు తామరాకులతో అల్లిన లుంగీ, మామిడాకుల లాల్చీ, గన్నేరుపూలతో చేసిన చేతిరుమాలు ధరించి వనమహోత్సవపు వనాంతర ప్రణాళిక చదివి జనాన్ని హడలగొట్టేస్తున్నారు.

వనంనిండా మనుషులు. అందరూ ఆకుల బట్టలు ధరించి శ్రద్ధగా వింటున్నారు. వేదాంతరావు వుపన్యాసం విలేఖరులు తాటాకులమీద తుమ్మముళ్ళతో రిపోర్టులు వ్రాసుకుంటున్నారు. 'ఇట్ప పీకి, చెట్టువేసే కార్యక్రమం గత శతాబ్దంనించీ జయప్రదంగా కొనసాగింది, మనుషులకు తింటానికేళ్లాటూ లేకండా, పుష్కలంగా గన్నేరు కాయలు, మేడిపళ్లూ, పసిమితో నిగనిగలాడే ఆకు గడ్డీ లభించుతున్నాయి.

మళ్ళీ మనం వరాల్ని పీకి ఇష్టైయ్యకండా క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ క్లాజుకింద చట్టం, మన రేపల్లె తాలూకాలోని వెడల్పుకి ప్రసిద్ధి చెందిన తాటాకుల్లో ఉల్లేఖింపబడింది.'

...నేనీ ఉపన్యాససారాన్ని జీర్ణం చేసుకోటానికి ప్రయత్నిస్తున్నాను. వనాంతరంలో (వా)నరులు చెట్లమీద పార్లమెంటరీ సాధారణ సమావేశమైనారు. పత్రికలు భూర్జర పత్రాలమీదా, ఎండు కలవపూలమీదా, వాటివాటి స్టాండర్డుని పట్టి తయారౌతున్నాయి.

స్వగతం నాతో మాట్లాడానికి వొస్తే, మెలకువవొచ్చింది. రోడ్ల పక్కన చెట్లుకు నీళ్ళుపోసే వాళ్ళులేక, తగురక్షణతో పురిట్లోనే నశిస్తున్నాయి. మళ్ళీ ఈ సుఖదుఃఖాలకి ప్రసిద్ధిచెందిన చీకటిగదిలో లేచాను. నా అభిమానంపు దీపం మినుకు మినుకు మంటోంది.

మా ఆవిడ తియ్య కాకరకాయ కూర వండి, పత్తికాయ పులుసు చేసింది. కాయలు విపరీతంగా దొరకగల భవిష్యత్తు 'అద్యతనభావిలో' ఉందని ఓ పత్రిక వ్యాఖ్యానించింది.

ఇంకో వనాంతర పత్రిక ఓ వనదేవత ఫోటో ప్రకటించి, కిందిగేయం రెండురంగుల్లో ముద్రింపించింది:

ప్రేమే వృక్షము
వృక్షమే జగమూ
జగములో మనము
వనములె జగము...తదరినా.

ఇట్టా. ఈ సాహిత్యం చదివి పాత్రికేయులు మనుషుల్ని దెయ్యాల్ని, దెయ్యాల్ని మనుషులనీ అనుకుంటున్నారు. దెయ్యాలు సినిమా ప్రొడక్షన్ ఆఫీసుల్లోనే ఉంటాయనడం అసత్యం. ప్రొడ్యూసర్లు తారల్ని దెయ్యాల్ని వొదిలించుకున్నట్టు వలచి వొదిలించుకున్నారు. మేకప్ డిపార్టుమెంటు నలభై యేళ్ళ ఆడ దెయ్యాల్ని పదహారేళ్ళ మనుష్య కుమారికలుగా చేస్తున్నది.

మా అబ్బాయి, ఎంతవొద్దన్నా వినకండా, చిల్లికాణీ పాతేసి వనమహోత్సవంలో శక్తి వంచనలేకండా పాల్గొన్నాడు. వాణ్ణి, 'కానీ మొలిపించే విధం ఇదికాదురా నీ తాడు తెగ. దానికి క్షేత్రం వేరేవుంది. ఇంకా దానికి ఎరువు కూడా వేరేవుందిరా నాయనా' అని నచ్చజెప్పి తీసుకెళ్ళాను. అక్కడరూపాయలుపాతేసిచీకట్లో పర్మిట్లూ మనుషుల రక్తమూ ఎరువుగా వేసి పదులు పండిస్తున్నారు. మావాడికి ఇదంతా చూపించాను. మావాడు కూడా పెద్దవాడై నాకు రూపాయలు పండిస్తాడు. ఇది చూసొచ్చిన మర్నాడే వాడు కాణీకి పెన్సిల్ కొని అర్ధణాకి ఇంకో కుర్రాడికి అమ్మి రూపాయిల పంటకి పునాది వేసుకున్నాడు. ఇప్పుడు వనాంతర

ప్రణాళిక చదువుతున్నాడు. ఎకనమిక్స్, కామర్సు డిగ్రీలు సంపాయిస్తాడు భవిష్యత్తులో అనటానికి సందేహ మేమిటి! అని మా ఆవిడ సంతోషిస్తోంది. ఊళ్లో ఇళ్ళున్నా నాకు గది లేదు. లోకంలో చెట్లు కోట్లకి కోట్లున్నా కాయలు దొరకవు. నిద్రపోయినా విశ్రాంతి లేదు. దీపం ఉన్నా వెలుగు లేదు. యుద్ధాలు ముగిసినా దేశాలకి శాంతి లేదు.

# ప్రళయం మధ్య ప్రపంచం

యం. యస్. చలం

అమెరికా జోక్యంతో కొరియా అంతర్యుద్ధం రెండు పెద్ద రాజ్యాల కొట్లాటగా రూపొందింది. కొరియా యుద్ధ భూమికి అమెరికా తన యంత్ర సహాయాన్నే కాక కాల్బలాన్ని సైతం తరలించింది. ఎందుకు? అన్న ప్రశ్నకు సమాధానంగా 'రష్యా మద్దతుతో ఉత్తర కొరియా సాగిస్తున్న దురాక్రమణ బారినుండి దక్షిణ కొరియాను రక్షించడానికీ, ప్రజాస్వామ్య వ్యవస్థలను పదిలపరచడానికీ, అని సాకు చెప్పింది. ప్రజాస్వామ్యంపట్లా, దక్షిణ కొరియాపట్లా అమెరికాకు గాఢానురాగం విరాజిల్లుతున్నదని విశ్వసించటం భ్రమప్రమాద సంజనితం. రష్యా బెబ్బులి క్రమక్రమంగా తన సామీప్యానికే చేరటం, తన ప్రాబల్యానికి భంగకరం కావటంవల్ల, దానిని దూరానే నిలువరించటం అవశ్యకమని భావించి యీ చర్యకు వుపక్రమించింది.

ఎంతో ఆర్భాటంతో కదనరంగంలో కాలిడిన అమెరికన్ సేనల వీరోచిత పోరాటం మూరెడు ముందుకు పోయి, బారెడు వెనుకకు తగ్గటంగా వుంది. కమ్యూనిజపు కైపుతో పోరు సలిపే వుత్తర కొరియా రెండు లక్షల సైన్యాన్ని పట్టి పల్లార్చాలంటే, పొట్టకొరకు పోరాడే అమెరికా సైన్యం అయిదు లక్షలయినా కావాలి. యుద్ధ తంత్రరీత్యా అంత పెద్దబలగాన్ని కొరియా రంగానికి కేటాయించటం కూడా సందేహమే. ప్రతిష్ఠ కొరకు అమెరికా అంతటి త్యాగానికి ఒడిగట్టి కొరియాను ఆక్రమించినా, దానిని నిలుపుకోగలరని విశ్వసించలేము. ఆనాడు అటునుండి రష్యా, ఇటనుండి చైనా యుద్ధంలో చేయి చేసుకుని అమెరికాను బయటకు నెట్టివేయవచ్చు.

రష్యా యింతవరకూ యుద్ధభూమికి తన సైన్యాన్ని తరలించలేదు కనుక తటస్థంగా వూరుకుంటుందని భావించటానికి వీలు లేదు. సేనలను పంపవలసిన అవసరం ఏర్పడకపోవుట వల్లనే అది మూకీభావం వహించింది. కొరియా అమెరికా హస్తగతం కానున్న తరుణంలో రష్యా తన మౌనవ్రతానికి స్వస్తివాచకం పలుకుతుంది. ఏనాడైతే యీ పరిస్థితి దాపురిస్తుందో ఆనాడే తృతీయ ప్రపంచ సంగ్రామం అనే భీభత్స నాటకానికి ప్రథమాంకం ప్రారంభమవుతుంది.

ఈ నాటకానికి రంగభూమి ఆసియా. సూత్రధారులు రష్యా అమెరికాలు. పాత్రధారులు ఆసియా దేశాలు. ఆసియా దేశాలను ఆసియా దేశాలతోనే జయించి తమ వంగడంలోకి తెచ్చుకోవటం పెద్దరాజ్యాల ఆదర్శం. యీ ఆము టెద్దుల పోరాటంలో నలిగి నాశనమయ్యేది ఆసియా ఖండం.

మూడో యుద్ధం ప్రారంభం కాకుండానే వుండాలి. అయినదా దాని అంతం అటంబాంబులతో చూడవలసిందే! అటం శక్తితో పరిసమాప్తమయ్యే యుద్ధం అశేష మానవ సముదాయాన్ని సంస్కృతిని, నాగరికతను పరిసమాప్తం చేయక మానదు. ఆనాడు విజయగర్వానికి ఆస్కారమే లేదు.

ప్రపంచంలో ఏ పౌరుడూ యీనాడు యుద్ధాన్ని వాంఛించటంలేదు. ప్రజాస్వామికానికి మా దేశమే పుట్టినిల్లు అంటూ డంబాలు పలికే పాలకులు ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా యుద్ధసన్నద్ధులు కావటం సిగ్గుచేటు. యుద్ధం కొరకు సాహసించే యిరుపక్షాల పెద్దలు తమ సాహసాన్ని యుద్ధం వైపు చూపక, శాంతియుతంగా వైమనస్యాలను పరిష్కరించుకొనుటకు చూపాలి. నిష్పాక్షిక సంఘం యెదుట, కొరియా యేకీకరణకు వుభయకొరియాల ప్రజాభిప్రాయాన్ని సేకరించి మెజారిటీ అంగీకారం మీద ఒకేరాజ్యంగా గుర్తించి, ఎన్నికలు జరిపి గెలుపొందిన ప్రతినిధులకు రాజ్యనిర్వహణ బాధ్యతను అప్పగించటంద్వారా యీ సమస్యను పరిష్కరించుకోవచ్చు.